క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు ఓ భక్తురాలు రూ.10 వేల విరాళం అందించింది. ఐ.పోలవరం మండలం జి.వేమవరానికి చెందిన నెల్లి ఇంద్రావతి సోమవారం ఈ మొత్తాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. దాతను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన సర్పంచ్

అమలాపురం రూరల్: పేరూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సర్పంచ్ దాసరి అరుణ ఆధ్వర్యంలో పేద వృద్ధులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి సుబ్బిరామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఇళ్ల ఏడుకొండలు, దాసరి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలుకుల సంబరం



బుగ్గలకు శూలాలు గుచ్చుకుని ట్రాక్టర్‌పై ఊరేగుతున్న యువకులు

అమలాపురం రూరల్: స్థానిక వన్నెచింతలపూడిలో వీరభద్రుని అలుకుల సంబరం (శూలాలు) కరికాల భక్త యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. యువకులు బుగ్గలకు శూలాలు గుచ్చుకుని ట్రాక్టర్‌పై ఊరేగారు. తొలుత వీరభద్రునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో సంఘం యువకులు 38 మంది ఈ శూలాలు గుచ్చుకుని సంబరాల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వీరభద్రుని దర్శించుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ లక్కా రాజారత్నం నాగవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జంపన రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసి.. ఉదారత చాటి



సహాయ ఫ్రాన్స్ క్లబ్ అందించిన ఇన్వర్టర్, సరకులతో పిల్లలు, వృద్ధులు

యానాం: యానాంకు చెందిన ఫ్రెంచ్ జాతీయత కలిగిన కొందరు ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. వృత్తి రీత్యా ఏళ్ల తరబడి అక్కడే ఉంటూ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అయినా భారతదేశంలోని తమ వారికి ఏవిధంగానైనా సహాయపడాలనే ఆలోచనతో 'సహాయ ఫ్రాన్స్ క్లబ్' అనే సంస్థను ఫ్రాన్స్‌లో నెలకొల్పారు. దాని ద్వారా యానాం పరిసర ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు. సోమవారం కోరంగి దుర్గామల్లేశ్వర వృద్ధులు, బాలల ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆశ్రమానికి ఇన్వర్టర్, గోశాలకు పశువుల దాణాను అందించారు. సహాయ ఫ్రాన్స్ క్లబ్ సభ్యులైన సరళ, సుష్మా, జీరాణి, దివ్య, లత, జ్యోత్స్న, కిరణ్మయి, రాజీ, క్రాంతి, హాజీర, జయ, శాంతి, లక్ష్మి, కిశోర్‌లు సాయాన్ని అందించారు.

సేవలే ఆదర్శం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: సంక్రాంతిని పురస్కరించుకుని పి.మల్లవరంలో వెయ్యి మంది మహిళలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ చీరలు పంపిణీ చేశారు. ఆయన స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సేవలను ఆదర్శంగా తీసుకుని జగనన్న సేవా సమితి ద్వారా సేవలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ దున్నా రాంబాబు, సమితి అధ్యక్షురాలు దడాల సువర్ణలత, నాగమ్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

యానాం: పట్టణ పరిధిలోని మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి క్రికెట్ టోర్నీ హోరాహోరీగా జరుగుతోంది. బ్లూపాంథర్స్ యువకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో మొత్తం 8 జట్లు తలపడుతున్నాయి. బుధవారం సెమీ ఫైనల్స్ నిర్వహించనున్నారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు సోమవారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, లంక బంగారంను సత్కరించారు. కార్యక్రమంలో దయ, పాపారావు, దేవా, ఉండ్రు వైష్ణవ్, ఎల్వీ చిన్ని, పీఈటీ వడ్డి వరప్రసాద్ పాల్గొన్నారు.

భక్తి ప్రభవించే..

- ఉత్సాహంగా తీర్థ మహోత్సవాలు
- సంస్కృతికి అద్దం పట్టిన సంబరాలు

ముమ్మిడివరం: భక్తి ప్రభవించింది.. అందరిలో ఉత్సాహం నింపింది.. ప్రభల తీర్థాలతో ఊరూ వాడా సందడి నెలకొంది.. సోమవారం అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కనుమ పర్వదినాన ప్రభల తీర్థాలు ఉత్సాహంగా జరిగాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పల్లిపాలెం, ఐ.పోలవరం మండలం మొక్కతోట, కాట్రేనికోన మండలం చెయ్యేరు, తాళ్లరేవు గ్రామాల్లో ఈ ఉత్సవాలు జరిగాయి. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో తీర్థ ప్రదేశాలు కిటకిటలాడాయి. పచ్చని పొలాల్లో రంగు రంగుల దుస్తులు, పువ్వులతో అలంకరించిన ప్రభలు చూపరులను ఆకట్టుకున్నాయి. పల్లిపాలెంలో ప్రభల తీర్థం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొమానపల్లి, కొత్తలంక, ముమ్మిడివరం గ్రామాల తల్లి ప్రభలను ఆయా గ్రామాల నుంచి ఊరేగింపుగా పల్లిపాలెంలో తీర్థ స్థలికి తీసుకు వచ్చారు. ముమ్మిడివరం అగ్రహారం, చింతలమెరక, వడ్డిగూడెం, పదవ మైలురాయి, రాజుపాలెం గ్రామాల ఉత్సవ ప్రభలు పచ్చని పొలాలు, మురుగునీటి డ్రైన్లు దాటుకుని తీర్థ ప్రదేశానికి వచ్చాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పెన్మత్స జగ్గప్పరాజు, పెన్మత్స చిట్టిరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి శివన్నారాయణ తదితరులు ఆహ్వానం పలికారు.

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దువారి వీధిలో గణికమ్మ ఆలయం వద్ద ప్రభల తీర్థం ఆదివారం జరిగింది. ఈదరపల్లి ప్రభలు, శ్రీశేషశయన, గణికమ్మ, కనకదుర్గ, మెట్ల కాలనీ ప్రభలను ఈ ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారి ప్రభల తీర్థానికి పట్టణం నుంచే కాకుండా పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ దంపతులు, మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మంగళంపల్లి ప్రదీప్ తదితరులు పూజలు చేశారు.

అమలాపురం రూరల్: నడిపూడిలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రభల ఉత్సవం జరిగింది. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అరిగెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, బీజేపీ నాయకుడు ఆర్‌వీ నాయుడు, కడియం సత్యనారాయణ పాల్గొన్నారు. పాలగుమ్మిలో శివాలయం నుంచి ఎంపీటీసీ పాలగుమ్మి విజయ, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసు, సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి ప్రభల ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ ప్రభను జగ్గన్నతోటకు తీసుకువెళ్లారు. సమనసలో ప్రభల తీర్థం జరిగింది. గుర్రం, జీపుతో ప్రభను వైఎస్సార్ సీపీ నాయకులు మామిడిపల్లి నాని ఊరేగించారు. సాకుర్రులో లక్ష్మీగణపతి ఆలయం వద్ద ప్రభల తీర్థం జరిగింది. సర్పంచ్ గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరంలో ప్రభల తీర్థం అట్టహాసంగా జరిగింది. ఇక్కడ మొక్కతోటలో జరిగిన ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. మండలంలో పలు గ్రామాల్లో ఎడ్లబండ్లు, మోటార్ సైకిళ్లను అలంకరించి ఊరేగింపుగా గ్రామ దేవతల ఆలయాలకు తీసుకువెళ్లి పూజలు చేశారు.

అల్లవరం: లక్ష్మణేశ్వరంలో ఉమా సమేత లక్ష్మణేశ్వర స్వామి ప్రభల ఉత్సవం సోమవారం జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ, ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. మొగళ్లమూరు, కొమరగిరిపట్నం గ్రామాల ప్రభలు లక్ష్మణేశ్వరంలో స్వామివారి ఆలయానికి చేరుకున్నాక ఉత్సవాన్ని ప్రారంభించారు. తొలుత మొగళ్లమూరులో ప్రభల ఊరేగింపును ఎంపీ చింతా అనురాధ ప్రారంభించారు. పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత నారాయణ స్వాములను ఆమె దర్శించుకుని పూజలు చేశారు. పూజలలో సర్పంచ్ రాయుడు విష్ణు, డాక్టర్ చింతా వంశీధర్, కొల్లు వెంకటరమణ, దేవదాయ శాఖ ఈఓ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, సన్నవిల్లి, వాడపర్రు, భీమనపల్లి, విలసవిల్లి గ్రామాల్లో ప్రభలను అలంకరించి ఘనంగా ఊరేగించారు. గ్రామాల్లో కొలువైన దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.



పల్లిపాలెంలో తీర్థ స్థలి వద్ద ప్రభలు



పల్లిపాలెంలో డ్రైన్ నుంచి ప్రభను తీసుకువస్తూ..



మొగళ్లమూరులో లక్ష్మణేశ్వర స్వామివారి ప్రభను దర్శించుకున్న ఎంపీ అనురాధ, తదితరులు



నడిపూడిలో విశ్వేశ్వరస్వామివారి ప్రభ ఊరేగింపు



గొల్లవిల్లిలో ప్రభను ఊరేగిస్తున్న ప్రజలు

సినీ హీరో కిరణ్ సందడి



అమలాపురంలో వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న హీరో కిరణ్

అమలాపురం టౌన్: అమలాపురంలో వర్ధమాన సినీ హీరో కిరణ్ అబ్బవరం ఆదివారం సందడి చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన్ని అభిమానులు కలిశారు. హీరో కిరణ్ నటిస్తున్న 'వినరో భాగ్యము విష్ణుకథ' ప్రమోషన్‌లో ఆయన పాల్గొని అభిమానులతో చర్చించారు. తొలుత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి హీరో కిరణ్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అనంతరం కిరణ్ పట్టణంలోని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి స్వగృహాలకు వెళ్లి ఆ రెండు చోట్లా అభిమానులతో సందడి చేశారు. కోనసీమలో పలుచోట్ల జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయం సంక్రాంతి సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. స్వామిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రభల ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

వైభవం.. సంక్రాంతి సంబరం



సంక్రాంతి సంబరాల్లో మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న మెట్రో కెమ్ కంపెనీల అధినేత బాలాజీ



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీ అనురాధ తదితరులు



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గోపూజ చేస్తున్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి తదితరులు

- పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ
- మురిపించిన ముత్యాల ముగ్గులు

అమలాపురం టౌన్: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.. అందరిలో సంతోషాన్ని నింపాయి.. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఈ వేడుకలు అట్టహాసంగా జరిగాయి.. హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో కోనసీమ సంక్రాంతి సంబరాలు ఆది, సోమవారాల్లో జరిగాయి. ఆదివారం కోనసీమ స్థాయిలో జరిగిన ముగ్గుల పోటీల్లో దాదాపు 800 మంది మహిళలు పాల్గొని ముత్యాల ముగ్గులను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి ఎంపీ చింతా అనురాధ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.సుజాతకు ఫ్రిజ్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎ.సంధ్యారాణికి వాషింగ్ మెషీన్, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న ములికి నాగేశ్వరికి గ్రైండర్‌ను ఎంపీ బహూకరించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ మెట్రో కెమ్ కంపెనీల తరఫున చైర్మన్ డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మి దంపతులు బహుమతులు అందజేశారు. పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధూర్, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం కనుమ పండగ సంబరాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గంగిరెద్దులు, సరదా కోడి పందేలు, కోలాటాలు, సంగీత విభావరీలు వంటి వినోద కార్యక్రమాలను మంత్రి వీక్షించారు. మంత్రి విశ్వరూప్‌ను డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించారు. సాయంత్రం నుంచి డాక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో అదే ప్రాంతంలో పది ప్రభలతో సంక్రాంతి ఉత్సవాలు జరిగాయి. నల్లవంతెన- ఎర్రవంతెన మధ్య ఉన్న బైపాస్ రోడ్డు ఈ సంక్రాంతి సంబరాలకు వేదికగా మారింది. అనంతరం బాణసంచా కాల్చారు. ఈ సంబరాలను గంధం పల్లంరాజు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గోపూజ

అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సుదర్శన హోమం జరిపారు. గోపూజను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలకు చెందిన గోవులను శుభ్రం చేసి వాటికి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: స్థానిక కామరాజుపేటలో తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, రవి, ముత్తాబత్తుల వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పోలీసు అధికారులు సంప్రదాయ దుస్తులతో వచ్చి వివిధ పూజలు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీఐ గూటం శివగణేష్, ఎస్సైలు బడుగు కనకారావు, కట్టా సుబ్బరాజు, ఏఎస్సై పట్టాభి, హెడ్ కానిస్టేబుల్స్ కోన సుబ్రహ్మణ్యం, రాజు, దవులూరి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంబరాలు

తాళ్లరేవు: పి.మల్లవరంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. సర్పంచ్ దున్నా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ధూళిపూడి ఈశ్వరి, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ముత్యాల జయలక్ష్మి, ఉంగరాల వెంకటేశ్వరరావు, వీఆర్‌అండ్‌బీ ప్రసాద్, విళ్ల సత్యనారాయణ, ధూళిపూడి బాబి పాల్గొన్నారు.

ఆ వెలుగులు ఎక్కడ!



బొటానికల్ గార్డెన్ వద్ద నిరీక్షిస్తున్న చిన్నారులు, మహిళలు

యానాం: పండగ వెలుగులు పూర్తిగా మరిచారు.. పర్యాటకులకు నిరాశ మిగిల్చారు.. యానాం పరిధిలోని బొటానికల్ గార్డెన్‌ను మూసివేయడంతో వచ్చిన పరిస్థితి ఇది. ఇక్కడ ఏటా సంక్రాంతి సంబరాల పేరిట నిర్వహించే మ్యూజికల్ ఫౌంటైన్ లేజర్ షో నిర్వహించకపోవడంతో సోమవారం అధిక సంఖ్యలో వీక్షకులు వచ్చి నిరాశతో వెనుదిరిగారు. రూ.కోట్ల పుదుచ్చేరి పర్యాటక శాఖ నిధులతో బొటానికల్ గార్డెన్‌లో మూడేళ్ల కిందట మ్యూజికల్ ఫౌంటైన్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా లేజర్ షోను సైతం ప్రదర్శించడానికి చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి పండగ మూడు రోజులూ లేజర్ షోను ప్రదర్శించేవారు. అయితే అనూహ్యంగా బొటానికల్ గార్డెన్ తలుపులు తాళం వేసి ఉండటంతో లేజర్ షోను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది నిరాశగా వెనుదిరిగారు.

వారి నిర్లక్ష్యమే కారణం

బొటానికల్ గార్డెన్‌లోని మ్యూజికల్ ఫౌంటైన్ నిర్వహణ బాధ్యత పీడబ్ల్యూడీ అధికారులు చూస్తుంటారు. దానిలో నీరు నింపడం, మోటార్లకు మరమ్మతులు చేయడం చేస్తుంటారు. కొన్ని నెలలుగా మ్యూజికల్ ఫౌంటైన్ నిర్వహణ లేక మూలనపడిందని చెబుతున్నారు. దీంతో పర్యాటక శాఖ సంక్రాంతి సెలవు రోజుల్లో రూ.6 లక్షల మేర రెవెన్యూ కోల్పోయిందని సమాచారం. దీనిపై ఆర్ఏఓ మునిస్వామి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో కనుమ పర్వదినాన సోమవారం స్వామి, అమ్మవార్లను గరుడ పుష్పక వాహనంపై అర్చకులు గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఆలయం నుంచి పల్లకీలో లక్ష్మీనృసింహస్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అరటిపళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించుకున్నారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు ఇచ్చారు.



అంతర్వేదిలో గరుడ పుష్పక వాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం

లక్ష్మీనృసింహుని జన్మనక్షత్ర పూజలు

అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని సోమవారం స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం అర్చకులు నిర్వహించారు.

జోరుగా సంప్రదాయ కోడి పందేలు



కొమరగిరిలో సంప్రదాయ కోడి పందెం



జార్జిపేటలో సంక్రాంతి కోడిపందేలను తిలకిస్తున్న రాంగోపాల్‌వర్మ

ఐ.పోలవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలో సంప్రదాయ కోడి పందేలు జోరుగా జరిగాయి. పోలీసుల నిఘా ఎక్కువ కావడంతో పేకాట, గుండాటలకు బ్రేక్‌లు పడ్డాయి. కొమరగిరి, మురమళ్ల, ఎదుర్లంక, కేశనకుర్రు, జి.వేమవరం, ఐ.పోలవరం మొక్కతోటలో కోడి పందేలు నిర్వహించారు. ఈ పందేలను వీక్షించేందుకు అనేక వాహనాలపై వేలాది మంది తరలివచ్చారు.

సంక్రాంతి అంటేనే కోడి పందేలు

తాళ్లరేవు: గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు లేకపోతే పండగ లేనట్టేనని గోదావరి వాసులు భావిస్తారని ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ అన్నారు. సోమవారం జార్జిపేట గ్రామంలో కోడి పందేలను గబ్బర్‌సింగ్‌తో కలసి తిలకించారు. ఈ సందర్భంగా గ్యాలరీల్లో కూర్చున్న ప్రజలకు ఆయన అభివాదం చేశారు. రామ్‌గోపాల్‌వర్మతో ఫొటోలు దిగేందుకు యువకులు పోటీ పడ్డారు. జార్జిపేటలో ఏర్పాటు చేసిన ఈ బరికి తెలుగు ఉభయ రాష్ట్రాలు, కర్ణాటక నుంచి అనేక మంది తరలివచ్చారు. ఈ ప్రాంగణమంతా వందలాది కార్లతో నిండిపోయింది.

అల్లవరం: పండగ వేడుకల్లో భాగంగా బోడసకుర్రు, గోడి తదితర ప్రాంతాల్లో సంప్రదాయ కోడి పందేలు జరిగాయి. మండలం మొత్తానికి రెల్లుగడ్డలో భారీ బరులు ఏర్పాటు చేశారు. ఇక్కడ రెండు సామాజిక వర్గాలకు చెందిన వారికి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అల్లవరం, గుత్తులవారిపాలెం, గుబ్బలవారిపాలెంలలో బరులు ఏర్పాటు చేశారు.

అపురూపం ఆత్మీయ కలయిక



కొలిశెట్టివారి ఆత్మీయ కలయికలో కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: రెడ్డిపల్లి గ్రామంలో కొలిశెట్టి కుటుంబీకుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. సుదూర ప్రాంతాల్లో ఉన్న 100 మంది ఒకచోట కలుసుకుని ఆట పాటలతో సందడి చేశారు. మహిళలకు ముగ్గులు, చిన్నారులకు గాలిపటాల పోటీలు, అలాగే ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ కలయికలో కొలిశెట్టి సత్యనారాయణమూర్తి, వెంకటేశ్వరరావు, పద్మనాభం, వీరవెంకటరమణ, జయప్రకాష్‌నారాయణ, ఆడపడుచులు, కోడళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాండ్రు, మునిమనమలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆమె పాట.. అందరి నోట

పాటలు రాస్తూ.. పాడుతున్న విజయలక్ష్మి



రావులపాలెం సీఆర్సీలో సంక్రాంతి పాట పాడుతున్న విజయలక్ష్మి



విజయలక్ష్మి

అమలాపురం టౌన్: ప్రతిభ ఉన్న కళాకారులు ఎందరో ఉంటారు.. వారికి సరైన వేదిక లేక బయటకు రాలేక పోతున్నారు. అలాంటి తరహాలోనే అమలాపురం బాలయోగి కాలనీకి చెందిన పెదపాటి విజయలక్ష్మి ఉండిపోయారు. డిగ్రీ చదువుకుని గృహిణిగా ఉన్న ఆమె పదేళ్ల నుంచి పాటలు రాయడం... ఆ పాటలకు ఆమే ట్యూన్ కట్టుకుని పాడడం ఓ అభిరుచిగా మార్చుకుంది. ఇప్పటి వరకూ 80 పాటలు వరకూ రాసి పాడుకుంటోంది. ఈ సంక్రాంతిపై రాసిన పాటను తొలిసారిగా సంగీత నేపథ్యంలో కంపోజ్ చేయించి రికార్డు చేసింది. అలా చేసిన పాటను కోనసీమ కపుల్ పేరుతో యూట్యూబ్‌లో పెట్టడంతో ఆమె గొంతు, కలం పాపులర్ అయింది. దీనికితోడు రావులపాలెం సీఆర్సీ వారు ఈ భోగి పండగ రోజున నిర్వహించిన సంక్రాంతి కార్యక్రమ వేదికపై విజయలక్ష్మి తన పాటను, గాత్రాన్ని తొలిసారిగా ప్రేక్షకుల ముందు ఆలపించి అందరిచే ఔరా అనిపించుకుంది. «వచ్చె నమ్మా ఓ కాంతి... తెచ్చెనమ్మా సంక్రాంతి» అంటూ విజయలక్ష్మి సంక్రాంతి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాడిన పాట ప్రేక్షకులనే కాదు నెటిజన్లను కూడా ఆకట్టుకుంది. 'విజయ సుబ్రహ్మణ్యం' కలం పేరుతో ఆమె పాటలు రాసి పాడుతోంది. ఆమె భర్త సుబ్రహ్మణ్యం పౌరహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

ఉత్తమ జాతి సాహివాల్ దూడ జననం

అలమూరు: పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో పెరిగే సాహివాల్ జాతి ఆవు దూడ మండలంలోని జొన్నాడలో జన్మించింది. గ్రామ ఉపసర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి పశువుల మకాంలో ఆదివారం రాత్రి కపిల ఆవుకు సాహిదార్ జాతి పెయ్యి దూడ పుట్టింది. హైదరాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ అధికారుల సహకారంతో సెమన్‌ను తీసుకువచ్చి కపిల ఆవుతో సంపర్కం చేశారు. తొలిఈతలో ఆ ఆవుకు పుంగనూరు దూడ జన్మించగా రెండో విడతలో సాహివాల్ జాతి దూడకు జన్మనిచ్చింది. తేనె రంగులో చూడముచ్చటగా ఉండే ఈ ఆవులో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉండటంతో పాటు సమశీతోష్ణస్థితిని తట్టుకుని అధిక పాలదిగుబడి ఇస్తుందని వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు.



కపిల ఆవుకు జన్మించిన అరుదైన సాహివాల్ జాతి ఆవు దూడ

సంధ్యా సమయం.. సింధూర వర్ణం



ఎస్.కొత్తపల్లిలో అలరించిన ఆకాశం

ఉప్పలగుప్తం: సంధ్యా వేళలో సింధూర వర్ణంలో ఆకాశం దర్శనమిచ్చింది.. పర్యాటక ప్రియులను ఆకర్షించింది. ఎస్.కొత్తపల్లిలో పాత అయినాపురం డ్రైన్ వంతెనపై నుంచి ఆదివారం సాయంత్రం ఆకాశం ఇలా కనిపించింది. నీలిరంగులో కనిపించే ఆకాశం మకర సంక్రాంతి రోజున ఎర్రటి సింధూరంలా దర్శనమివ్వడంతో పలువురు వీక్షించడానికి వచ్చి తమ చరవాణిల్లో చిత్రీకరించారు.